ఆంధ్రజ్యోతి
andhrajyothy.com

నిజామాబాద్
జిల్లా వార్తలు
5
శనివారం 29 నవంబరు 2025



పల్లెల్లో వేడెక్కుతున్న రాజకీయం

మొదలైన ఎన్నికల కోలాహలం

- కొనసాగుతున్న నామినేషన్ల స్వీకరణ
- బీసీ అస్త్రాన్ని వాడుకుంటున్న బీఆర్ఎస్, బీజేపీ
- గెలుపు గుర్రాల కోసం రాజకీయ పార్టీల వేట
- బలమైన అభ్యర్థులను బరిలో దించేందుకు వ్యూహం
- నేడు మొదటి విడత నామినేషన్లకు చివరి రోజు

సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలకావడంతో గ్రామాల్లో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఇప్పటికే బోధన్ డివిజన్‌లో మొదటి విడత ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలకాగా మరో రెండు రోజుల్లో నిజామాబాద్ డివిజన్ ఆ తర్వాత ఆర్మూర్ డివిజన్‌లలో నామినేషన్‌ల పర్వం ప్రారంభంకానుంది. ఆశావహులు ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించారు. రోడ్డు వెంట వెళ్లేవారిని సైతం పలకరిస్తూ వారికి ఏ అవసరమున్న తీరుస్తూ అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఏ అవకాశం దొరికినా తమకు అనుకూలంగా మార్చుకునేందుకు అభ్యర్థులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

నిజామాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల కోలాహలం మొదలైంది. జిల్లాలో ఇప్పటికే మొదటి విడత పంచాయతీ, వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలై నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. శనివారం మొదటి విడత నామినేషన్‌ల గడువు ముగియనుండగా ఈ నెల 30 నుంచి రెండో విడత నామినేషన్‌లు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామాల్లో గెలుపు గుర్రాలపై రాజకీయ పార్టీలు దృష్టిపెట్టాయి. గ్రామాలలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎంపికలో రాజకీయ పార్టీలు ద్వితీయశ్రేణి నాయకుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తూ బలమైన అభ్యర్థులనే బరిలో దించేందుకు వ్యూహ రచన చేస్తున్నాయి. ప్రధానంగా అధికార పార్టీ కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌లతో పాటు జిల్లాలో బలంగా ఉన్న బీజేపీ సైతం అన్ని స్థానాలలో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నాయి. గ్రామాల్లో పేరు ఉన్న ఆశావహులను బరిలో దించేందుకు అన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. కొన్నిచోట్ల పోటీ అధికంగా ఉండడంతో వారికి వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామని బుజ్జగిస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తున్నాయి.

ఎవరి వ్యూహాలు వారివే..

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గెలుపుతో నూతన ఉత్సాహంతో ముందుకెళ్తుంది. అదే ఉత్సాహంతో పంచాయతీ, వార్డు ఎన్నికల్లో సత్తాచాటి అత్యధిక స్థానాలు గెలిచే విధంగా వ్యూహాలు రచిస్తోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ప్రధాన ఎజెండాగా గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎన్నికల్లో పార్టీ గుర్తు లేకున్న తమకు అనుకూలంగా ఉన్న వారిని పోటీలో నిలిపేందుకు అధికార పార్టీ ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవల మహిళా సంఘాల మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ, పావలా వడ్డీ రుణాలు, ఉచిత బస్సు, సన్న బియ్యం, సన్న ధాన్యానికి బోనస్ వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటాలని చూస్తుంది. ఆరు గ్యారంటీల అమలుతో పాటు రైతు భరోసా,

మిగతా 8వ పేజీలో...


అమ్దాపూర్‌లో నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించాలి

- ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- అమ్దాపూర్‌లో నామినేషన్ కేంద్రాల పరిశీలన

బోధన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తుండా తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ మండలంలోని అమ్దాపూర్ తదితర గ్రామాలలో ఎన్నికల కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడి నామినేషన్ ప్రక్రియ అమలు విధానం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. అవసరమైన ధ్రువపత్రాల గురించి అభ్యర్థులకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ విఠల్, డీఆర్‌డీవో ఏవో మధుకర్, ఎంపీడీవో కిషోర్ కుమార్ తదితరులున్నారు.

సాదాబైనామా అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- చిన్న చిన్న కారణాలతో తిరస్కరించొద్దు
- అర్హులైన వారికి యాజమాన్య హక్కులు కల్పించాలి
- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

8

ప్రశాంతంగా ఎన్నికలు జరుపుకోవాలి

- వదంతులను ఎవరూ నమ్మొద్దు
- సోషల్ మీడియాలో రెచ్చగొడితే చర్యలు తప్పవు
- ఏసీపీ రాజవెంకట్ రెడ్డి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ రాజవెంకటరెడ్డి

నిజామాబాద్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికలు జరుగుతున్న వేళ ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ఏసీపీ రాజ వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం రూరల్ మండలం ఆకుల కొండూరులో పోలీసు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ గ్రామస్థులకు దిశానిర్దేశం చేశారు. గత ఎన్నికల్లో జరిగిన ఘటనల కారణంగా ఆకుల కొండూరు గ్రామం సమస్యాత్మక గ్రామ జాబితాలో ఉందన్నారు. దాంతో గ్రామంలో ప్రతిష్ఠాత్మకంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా డబ్బులు పంచడం, ఘర్షణలకు దిగడం, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం వంటి వాటిని చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు లేకపోవడం పెద్ద లోటని, వీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ముందుకు వచ్చిన ఎస్‌ఆర్ఐ సురేష్‌ను ఏసీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు అశోక్ కుమార్, సుధీర్, జితేందర్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

'బంగారు' రిత్విక

- ఈత పోటీల్లో బినోలకు చెందిన అమ్మాయి సత్తా
- ఖేలో ఇండియా యూనివర్సిటీ పోటీల్లో ప్రతిభ


పతకాలతో మిట్టపల్లి రిత్విక

నవీపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ 2025 స్విమ్మింగ్ పోటీల్లో మండలంలోని బినోలకు చెందిన మిట్టపల్లి రిత్విక సత్తా చాటింది. రాజస్థాన్‌లోని జైపూర్ సవాయి మాన్‌సింగ్ స్టేడియంలో జరిగిన పోటీల్లో రిత్విక ఒక బంగారు పతకం, రెండు కాంస్య పతకాలను సాధించింది. ఈ నెల 25 నుంచి 28వరకు జరిగిన పోటీల్లో రిత్విక ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని కలింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రీయల్ టెక్నాలజీ యూనివర్సిటీ తరఫున పోటీలో పాల్గొని పతకాలను కొల్లగొట్టింది. 50మీటర్ల బెస్ట్ స్ట్రోక్‌లో బంగారు పతకం, 40100 మిడ్లే రిలేలో, 4200 ఫ్రీస్టైల్ రిలేలో కాంస్య పతకాలు సాధించింది. మూడు పతకాలను సాధించిన రిత్వికను పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి ఉమేష్, ఉపాధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడిల శ్రీరాములు అభినందించారు.


బీరప్ప తండా వద్ద తెగిపోయిన హైలెవల్ వంతెన

తెగిన వంతెన.. ఆగిన ప్రయాణం

- 30 కిమీ. అదనపు ప్రయాణం
- ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలు

ధర్పల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఒన్నాజిపేట అటవీ ప్రాంతంలోగల బీరప్ప చెరువు పొంగి వరద ఉధృతికి హైలెవల్ వంతెన తెగిపోయింది. దీంతో కొటాల్‌పల్లి గ్రామానికి మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని శివారు గ్రామమైన కొటాల్‌పల్లి గ్రామ దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంటుంది. కొటాల్‌పల్లి గ్రామ ప్రజలు ఇదే వంతెన మీదగా బీరప్ప తండా, ఒన్నాజిపేట్ గ్రామాల మీదుగా మండల కేంద్రానికి రావడానికి దాదాపు 15కిమీ. దూరం ఉంటుంది. ప్రస్తుతం వంతెన తెగిపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో కొటాల్‌పల్లి గ్రామస్థులు మండల కేంద్రానికి రావాలంటే ఇందల్వాయి మండలం డొంకల్, జీకే తండా, గౌరారం, లింగాపూర్, ఎల్లారెడ్డిపల్లి చౌరస్తా, అన్సాన్‌పల్లి, మద్దుల్ తండాల మీదుగా దాదాపు 30కిమీ. దూరం నుంచి ధర్పల్లికి వస్తున్నారు. కొటాల్‌పల్లి గ్రామంలో బ్యాంకు లేకపోవడంతో ఒన్నాజిపేట్‌లోని బ్యాంకుకు వచ్చి గ్రామస్థులు లావాదేవీలు జరుపుతున్నారు. ధర్పల్లికి చెందిన ప్రజలు ఒన్నాజిపేట్, కొటాల్‌పల్లి మీదుగా కామారెడ్డి, హైదరాబాద్ ఇదే మార్గం మీదుగా ప్రయాణం చేస్తారు. ఈ వంతెన మార్గం ద్వారా వెళితే సమయంతో పాటు ప్రయాణం తగ్గుతుంది. వంతెన తెగిపోవడంతో కొనుగోలు కేంద్రంలో సేకరించిన ధాన్యాన్ని తరలించేందుకు ఇబ్బంది పడుతున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు..

: నల్ల గంగారెడ్డి, ధర్పల్లి



కొటాల్‌పల్లి వద్ద తెగిపోయిన హైలెవల్ బ్రిడ్జి వద్ద ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రం నుంచి కొటాల్‌పల్లి మీదుగా కామారెడ్డి వెళ్లాలంటే ఈ రోడ్డుమీదుగానే వెళితే సమయం ఆదా కావడంతో పాటు ప్రయాణం సులభం అవుతుంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

వ్యవసాయ పనులకు ఇబ్బందులు..

:రాజేందర్‌రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్, ఒన్నాజిపేట్



బీరప్ప తండా వద్ద వంతెన తెగడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వ్యవసాయ పనులకు అటువైపు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. హార్వెస్టర్లు, ట్రాక్టర్లు, వాహనాలు వాగులోనుంచి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వెంటనే పనులు పూర్తి చేయాలి.

పోలీసు సిబ్బందికి ఉన్ని దుస్తుల అందజేత


దుస్తులు అందజేస్తున్న సీపీ సాయిచైతన్య

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏఆర్, సివిల్ పోలీసు సిబ్బందికి శుక్రవారం సీపీ సాయిచైతన్య పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఉన్ని దుస్తులు, టీషర్టులు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. చలికాలంలో ప్రతి ఒక్కరూ ఉన్ని దుస్తులను వేసుకోవాలన్నారు. విధి నిర్వహణలో వీటిని ఉప యోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ ఏఆర్ రాంచందర్‌రావు, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, అడ్మిన్ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

రెండో రోజు నామినేషన్ల స్వీకరణ

- సర్పంచ్ స్థానాలకు 164, వార్డు స్థానాలకు 286

ఇందూర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మొదటి విడత ఎన్నికలు జరిగే మండలాలలో రెండో రోజు శుక్రవారం మొత్తం సర్పంచ్ స్థానాలకు 164 నామినేషన్లు, వార్డు స్థానాలకు 286 నామినేషన్లు దాఖలయ్యాయి. బోధన్ మండలంలో సర్పంచ్ స్థానాలకు 16, వార్డు స్థానాలకు 34, సాలూరలో 2, 8, మోస్రాలో 1, 16, రెంజల్‌లో 24, 25, నవీపేట్‌లో 18, 49, ఎడపల్లిలో 15 44, కోటగిరి 20, 15, పొతంగల్‌లో 30, 19, చందూర్ 12, 11, వర్ని 15, 39, రుద్రూరులో సర్పంచ్‌లకు 153, వార్డు స్థానాలకు 31 నామినేషన్లు దాఖలయ్యాయి.

పైసలెప్పుడు పడ్తయో..?

- మొక్కజొన్న రైతుల ఖాతాల్లో జమకాని నగదు
- 40 రోజులుగా తప్పని ఎదురుచూపులు
- ఏర్గట్ల మండలంలో 33,350 క్వింటాళ్ల కొనుగోళ్లు

6

విద్యను కార్పొరేట్ ఉత్పత్తి సాధనంగా మార్చారు

- ఆత్మగౌరవం, అసమానతలు లేని సమాజం కోసం పోరాడాలి
- ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ నాయకురాలు సంధ్య


మహా సభలో మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య

పెర్కిట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో విద్యను కార్పొరేట్ ఉత్పత్తి సాధనంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్చాయని పీవోడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్య అన్నారు. ఆర్మూర్ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన 23వ పీడీఎస్‌యూ మహాసభలో ఆమె మాట్లాడారు. బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయిస్తూ పేద, మధ్య తరగతి విద్యార్థులకు నష్టం చేకూరుస్తున్నారని ధ్వజమెత్తారు. దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడానికి హిడ్మా లాంటి పోరాట యోధులను హతమార్చుతున్నారని, విద్యార్థుల హక్కుల కోసం మహిళలు, ఆదివాసులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఆత్మగౌరవం, అసమానతలు లేని సమాజం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అదే విధంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. నాగరాజు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నేటి వరకు విద్యాశాఖ మంత్రిని నియమించలేదని ఒక వైపు ప్రభుత్వ విద్యను ప్రోత్సహిస్తున్నామంటునే మరో వైపు స్కూల్‌లను, కాలేజీలను మూసి వేస్తున్నారని అన్నారు. సంక్షేమ హాస్టల్స్ గురుకులాల్లో అనేక సమస్యలు నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు విద్యార్థులు జంబి హనుమాన్ ఆలయం నుంచి సీవీఆర్ జూనియర్ కళాశాల వరకు భారీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆర్. గౌతమ్, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు పస్కు నర్సయ్య, ఐఎఫ్‌టీయు జిల్లా ప్రధాన కార్య దర్శి ఎస్. దాసు, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, జిల్లా సహాయ కార్యదర్శి ప్రిన్స్, ఉపాధ్యక్షుడు కార్తీక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాపోలు భాస్కర్

సమస్యలు పరిష్కరించే వారినే ఎన్నుకోవాలి

- హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్

నిజామాబాద్ లీగల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే న్యాయవాదులను రానున్న బార్ కౌన్సిల్ ఎన్నికల్లో గెలిపించుకోవాలని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ తెలిపారు. జిల్లాకు శుక్రవారం వచ్చిన ఆయన జిల్లా బార్ అసోసియేషన్‌లో బార్ అధ్యక్షుడు మామిళ్ల సాయి రెడ్డి, జిల్లా న్యాయవాదులతో సమావేశమై మాట్లాడారు. చాలా ఏళ్లుగా ఒకే బార్ కౌన్సిల్ కొనసాగుతోందని, జనవరి 30న జరిగే ఎన్నికల్లో తాను పోటీ చేయనున్నట్లు తెలిపారు. తనకు అవకాశం ఇస్తే రాష్ట్రంలో ఇటీవలి కాలంలో న్యాయవాదులపై జరుగుతున్న హత్యలు, దాడులను అరికట్టేందుకు 'అడ్వకేట్ ప్రొటెక్షన్‌యాక్ట్' బిల్లు అత్యంత అవసరమని, దాని అమలుకు తాను కృషి చేస్తానని తెలిపారు. అలాగే జూనియర్ న్యాయవాదులకు స్టయిఫండ్ పెంపు, వారి ప్రాక్టీస్‌కు తోడ్పడే విధంగా పుస్తకాల పంపిణీ వంటి ముఖ్య అంశాలపై తాను ముందుండి పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి మాణిక్ రాజు, వైస్ ప్రెసిడెంట్ సురేష్, జాయింట్ సెక్రటరీ ఝాన్సీ రాణి, మంజిత్ సింగ్, పీపీ రాజేశ్వర్, జీపీ ఆముదాల సుదర్శన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

దేశభక్తిని నింపిన గేయం

వందేమాతరం..

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారతీయుల్లో దేశభక్తిని నింపిన గేయం వందేమాతరం అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. వందేమాతరం గీతం 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని వివేకానంద హైస్కూల్‌లో సామూహిక వందేమాతర గేయాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతలో దేశభక్తిని పెంపొందించేందుకు వందేమాతరం 150 ఏళ్ల వేడుకలను దేశవ్యాప్తంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వందేమాతర గేయం స్ఫూర్తితో స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా విప్లవకారులు పోరాటం చేశారని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మండల ఎంఈవో సాయరెడ్డి, బీజేపీ నాయకులు ఆనంద్‌రావు, మేకల సాయిప్రవీణ్, పవన్ ముందాడ పాల్గొన్నారు.


ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి వందేమాతర గీతం ఆలపిస్తున్న ఎమ్మెల్యే

క్రైం సమాచారం

భర్త చేతిలో భార్య హత్య

ఎడపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో భర్త, భార్యను కొట్టగా ఆమె మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రమ కథనం ప్రకారం.. మండలంలోని ఎమ్మెస్సీ ఫారం గ్రామానికి చెందిన మొహ్మద్ హుస్సేన్, సుల్తానా బేగం భార్యాభర్తలు. వీరిద్దరికి మద్యం తాగే అలవాటు ఉంది. గురువారం సాయంత్రం మద్యం తాగడానికి సుల్తానా బేగం(50) సమీపంలోని షబానా ఇంటికి వెళ్లి మద్యం తాగుతుండగా.. హుస్సేన్ వచ్చి సుల్తానాతో గొడవపడ్డారు. ఆవేశంతో ఆమె మెడ పట్టుకుని గోడకు మోదడంతో తీవ్రగాయాలై అపస్మారకస్థితిలోకి వెళ్లింది. సుల్తానా బేగంను షబానా, హుస్సేన్ ఇద్దరు కలిసి తన ఇంటికి తీసుకు వచ్చి ఇంట్లో పడుకోబెట్టగా అప్పటికే ఆమె మృతిచెందిందని ఆమె కుమారుడు అబ్దుల్ ఖాదర్ తెలిపాడు. ఖాదర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

కోటగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని హంగర్గ గ్రామానికి చెందిన లక్ష్మి(38) అనే వివాహిత మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు. లక్ష్మి గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె భర్త మద్యానికి బానిస కావడంతో కుటుంబ పోషణ సైతం భారంగా మారింది. గురువారం సాయంత్రం ఇంట్లో భార్యభర్తలు గొడవ పడ్డారు. దీంతో లక్ష్మి జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి మస్తాన్ గౌండ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తాగిన మైకంలో కిందపడి మృతి

ఎడపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకంపేట శివారులోని రైల్వే గేటు ప్రాంతంలో తాగిన మైకంలో కిందపడి బోధన్ పట్టణానికి చెందిన బొడ్డుల నరేందర్(46) మృతి చెందినట్లు ఎస్సై రమ తెలిపారు. పట్టణంలో పాన్‌గల్లీకి చెందిన నరేందర్‌కు వివాహమై 20 ఏళ్లయినా పిల్లలు కలుగకపోవడంతో అతడి భార్య మూడేళ్ల కిందట వదిలేసి వేరే పెళ్లిచేసుకుంది. అప్పటి నుంచి నేందర్ తాగుడుకు బానిసై ఎక్కడ పనిచేస్తే అక్కడే ఉండేవాడని, గురువారం రాత్రి మద్యం మత్తులో జానకంపేట రైల్వేగేటు వద్ద పడి చనిపోయాడని మృతుడి తమ్ముడి భార్య రజిని తెలిపారని ఎస్సై వివరించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్..


పార్వతిబాయి(ఫైల్)

మద్నూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచూర్ మాజీ సర్పంచ్ పార్వతిబాయి(51) గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. గురువారం అర్ధరాత్రి గుండెనొప్పి రావడంతో బిచ్కుంద ఆస్పత్రికి తరలించారు. వైద్యులు నిజామాబాద్‌కు రెఫర్ చేయగా తరలిస్తుండగా మృతిచెందరన్నారు.పార్వతిబాయి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలు

నిజామాబాద్ లీగల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితుడు షేక్ అహ్మద్‌కు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ, నిజామాబాద్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి పి.సాయిసుధ శుక్రవారం తీర్పు వెలువరించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీ నర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఎడపల్లి మండలం నెహ్రూనగర్ గ్రామానికి చెందిన షేక్ అహ్మద్ 2020 అక్టోబరు 12న రామ్‌నగర్‌లోని కల్లు బట్టీకి కల్లు తాగడానికి వెళ్లాడు. అక్కడ కల్లు అమ్ముతున్న పున్నమల్ల రాజేష్ గౌడ్‌ను ఉద్దెరకు కల్లు ఇవ్వాలని అడిగాడు. యజమాని గణేష్ గౌడ్ లేరని, నిజామాబాద్ నగరానికి వెళ్లారని, అందువల్ల ఉద్దెర కల్లు ఇవ్వడం కుదరదని రాజేష్‌గౌడ్ తెలిపాడు. దీంతో ఆగ్రహించిన షేక్ అహ్మద్ కల్లు సీసాతో రాజేష్ గౌడ్ ముఖంపై దాడి చేసి గాయపర్చాడు. దీనిపై రురల్ పోలీసులు కేసు నమోదు చేయగా.. కోర్టు విచారణ అనంతరం హత్యాయత్నంగా పరిగణించి జడ్జి పి.సాయిసుధ నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఒక నెల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పు వెల్లడించారు.

బ్యాంక్ ఖాతా నుంచి రూ.30 వేలు మాయం

బీర్కూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బానోత్ విజయ్ అనే ట్రాక్టర్ డ్రైవర్ బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.30 వేలు కాజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 20న విజయ్‌కి ఫోన్ పేలో ఓ యాప్ ద్వారా ఒక ఓటీపీ వచ్చింది. దీంతో విజయ్ ఆ ఓటీపీని రద్దు చేశాడు. అనంతరం 21న తిమ్మాపూర్‌లోని మొబైల్ బ్యాంకింగ్ కేంద్రానికి వెళ్లాడు. నగదు డ్రా చేసుకోవడానికి ప్రయత్నించాడు. కాని ఖాతాలో డబ్బులు లేవని కేంద్రం నిర్వాహకుడు చెప్పాడు. దీంతో విజయ్ కంగు తిన్నాడు. 25న బీర్కూర్‌లోని యూనియన్ బ్యాంకుకు వచ్చి ఆరా తీయగా.. యూపీఐ నుంచి డబ్బులు తీశారని బ్యాంకు అధికారులు తెలిపారు. తాను యూపీఐ ద్వారా డబ్బులు తీయలేదని బాధితుడు తెలిపాడు. అనంతరం సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేశారని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.


బీఆర్ఎస్‌లో చేరిన వారితో బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి

కమ్మర్‌పల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్లా జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పీఏసీఎ డైరెక్టర్ బుర్ర శంకర్ గౌడ్ శుక్రవారం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యేను కలిసి గులాబీ కండువా కప్పుకొన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ గ్రామీణ స్థాయి నుంచి పార్టీ పటిష్టతకు పాటుపడాలని ప్రశాంత్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ భూమన్న, నాయకులు రాజారాం, జూల భూమన్న, రాజేశం, గంగనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులు తయారుచేసిన వంటకాలను పరిశీలిస్తున్న దృశ్యం

విద్యావికాస్‌లో ఫుడ్ ఫెస్టివల్

బోధన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పాతకాలం నాటి వంటకాలతో సంపూర్ణం ఆరోగ్యం లభిస్తుందని విద్యావికాస్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బోధన్‌లోని విద్యావికాస్ జూనియర్ కళాశాలలో విద్యార్థులచే ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థినులు తమ ఇళ్ల వద్ద చేసుకువచ్చిన సంప్రదాయ వంటకాలను పరిశీలించారు. యువత జంక్ ఫుడ్‌లకు అలవాటు పడడంతో అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఇతర దేశాలలో సద్ది పెరుగన్నం, పప్పుచారు, పులుసులకు బాగా డిమాండ్ ఉందని కార్యక్రమంలో విద్యావికాస్ విద్యాసంస్థ చైర్మన్ వై.శ్రీనివాస్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పైసలెప్పుడు పడ్తయో..?

- మొక్కజొన్న రైతుల ఖాతాల్లో జమకాని నగదు
- 40 రోజులుగా ఎదురుచూపులు
- ఏర్గట్ల మండలంలో 33,350 క్వింటాళ్ల కొనుగోలు

ఏర్గట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి కష్టపడి పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని డబ్బుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్నను విక్రయించి 40 రోజులైన డబ్బులు జమకాకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. యాసంగి సాగుకు అప్పులు చేయాల్సిన దుస్థితి వచ్చిందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి సమస్య వివరిస్తున్న ఏర్గట్ల మండల రైతులు (ఫైల్)

మండలంలో ఇలా..

రైతులు కష్టపడి పండించిన మొక్కజొన్నకు తక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకొని నష్టపోకుండా ఉండేదుకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించి వారికి రూ.2400 మద్దతు ధరతో కొనుగోలు చేసింది. మండలకేంద్రంతో పాటు తాళ్లరాంపూర్ సొసైటీల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ మొక్కజొన్నను విక్రయించారు. ఏర్గట్లలో 4,850 క్వింటాళ్లు, తాళ్లరాంపూర్ సొసైటీలో 28,500, మొత్తం 33,350 క్వింటాళ్ల మక్కను కొన్నారు. ఇప్పటికి 40 రోజులు కావస్తున్నా ఒక్క రైతు ఖాతాలో డబ్బులు జమకాక పోవడంతో రైతన్నకు కన్నీరు తప్పడం లేదు. ఇటీవలే తహసీల్దార్ కార్యాలయంతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ కోసం వచ్చిన కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డిని రైతులు కలిసి సమస్యను విన్నవించారు.

రైతులకు న్యాయం చేయాలి



తాళ్లరాంపూర్ సొసైటీలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయగా సంఘ పరిధి గ్రామాల్లోని రైతులు మొక్కజొన్నను విక్రయించారు. ఇప్పటి వరకు రైతు ఖాతాల్లో డబ్బులు వేయడం లేదు. వర్షాకాలంలో భారీగా కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిని తీవ్రంగా రైతులు తీవ్రంగా నష్టపోగా.. చేతికి వచ్చి విక్రయించిన మొక్కజొన్న డబ్బులు రాక రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలి.

– పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ చైర్మన్, తాళ్లరాంపూర్

డబ్బులు వెంటనే చెల్లించాలి



మండలంలోని సొసైటీలో మొక్కజొన్న విక్రయించి నెల రోజులకు పైగా అయింది. ఇప్పటికీ ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదు. మూడు ఎకరాల్లో ఎకరానికి 15 వేల చొప్పున పెట్టుబడి పెట్టాను. మద్దతు ధర వస్తుందని సొసైటీలో విక్రయించాను. ఇప్పటికీ డబ్బులు పడలేదు. యాసంగి పెట్టుబడికి నగదు చేతిలో లేక అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మొక్కజొన్న రైతుల డబ్బులు వెంటనే చెల్లించాలి.

– పొదుకూరి మహేష్, రైతు, ఏర్గట్ల మండలం


సాలూరలో నామినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

తప్పిదాలకు తావు ఉండొద్దు

- పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలి
- బోధన్ డీఎల్‌పీవో నాగరాజు

సాలూర/కోటగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తప్పిదాలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను జరపాలని బోధన్ డీఎల్‌పీవో నాగరాజు, సాలూర ఎంపీడీవో శ్రీనివాస్ ఎన్నికల అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నామినేసన్ కేంద్రాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్న విధానాన్ని పర్యవేక్షించారు. రిజిస్టర్‌లో నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుల వివరాలను పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి సందేహాలున్నా అధికారులు వెంటనే నివృత్తి చేసి నామినేషన్ దాఖలు చేసేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే డీఎల్‌పీవో పోతంగల్‌లోని నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియపై అధికారులకు పలు సూచనలు అందించారు. ఆయన వెంట స్థానిక ఎంపీడీవో చందర్, పంచాయతీ కార్యదర్శి యాదవ్ తదితరులు ఉన్నారు.


ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

అధికారులు ఫుల్ బిజీ

ఆలూర్ నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల అధికారులు ఏర్పాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు. పోలింగ్ కోసం అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి, స్టేషనరీ సామగ్రి తదితరాలను సక్రమంగా సిద్ధం చేస్తున్నారు. దీంతో కార్యాలయ పరిసరాల్లో అధికారులు ఫుల్ బిజీ అయ్యారు. ఆలూరు ఆలూరు మండలంలో శుక్రవాఆరం ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో రాజలింగం, సూపర్‌వైజర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, నవీన్, వందన, దినేష్, తరుణం, నాగేంద్ర, కిషోర్, కారోబార్ సంతోష్, సిబ్బంది ఎన్నికల నిర్వహణ పనుల్లో పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటేయాలి

జక్రాన్‌పల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లు తమ హక్కును స్వేచ్ఛాయుతంగా వినియోగించుకోవాలని డిచ్‌పల్లి సీఐ వినోద్ సూచించారు. మండలంలోని నారాయణపేట్‌లో శుక్రవారం ఎన్నికలపై గ్రామస్థులతో సమావేశమయ్యారు. ప్రజలు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకావొద్దన్నారు. ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం పంపిణీ, ఓటర్లను బెదిరించడం గుంపులుగా తిరిగి ఉద్రిక్తత సృష్టించి, ప్రత్యర్థులపై దాడులు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై జి.మహేష్, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వినోద్

నామినేషన్ పత్రాలను నిశితంగా పరిశీలించండి

జిల్లా ఎన్నికల పరిశీలకుడు కిషన్

మోస్రా, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులు నిశితంగా పరిశీలించాలని జిల్లా నోడల్ అధికారి, ఎన్నికల పరిశీలకుడు జే.కిషన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మోస్రా గ్రామ పంచాయతీ నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి సందేహాలు వచ్చినా నివృత్తి చేయాలని ఆయన సూచించారు. అనంతరం బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ కృష్ణ నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రాలకు 100మీటర్ల దూరంలో వాహనాలు ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ అధికారి నాగనాథ్, అసిస్టెంట్ అధికారి రాజ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

కోటగిరి/రెంజల్ : కోటగిరి, పోతంగల్, సాటాపూర్, రెంజల్‌లో ఏర్పాటు చేసిన పంచాయతీ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను శుక్రవారం బోధన్ ఏసీపీ శ్రీనివాస్ పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులు గుమిగుడకుండా చూసుకోవాలని సూచించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి కేంద్రంలో బందోబస్తు నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట రుద్రూర్ సీఐ కృష్ణ, ఎస్సై సునీల్, రెంజల్ ఎస్సై చంద్రమోహన్, పోలీసు సిబ్బంది తదితరులున్నారు.


వివరాలు తెలుసుకుంటున్న నోడల్ అధికారి

అభివృద్ధిని జీర్ణించుకోలేక సీఎంపై ఆరోపణలు

- కో ఆపరేటివ్ యూనియన్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి

భీమ్‌గల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న పరిపాలన, అభివృద్ధిని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మహిళా సంఘాల రుణమాఫీ, ఇందిరమ్మ చీరలపై ఆరోపణలు చేస్తున్నారని కోఆపరేటివ్ యూనియన్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మోహన్‌రెడ్డి మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో బీఆర్ఎస్‌కు సర్పంచ్ అభ్యర్థులు దొరకని పరిస్థితులలో ప్రశాంత్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. 10 ఏళ్ల పాలనలో ఏనాడు మహిళా సంఘాలా రుణాల మాఫీ ఊసెత్తన్ని బీఆర్ఎస్, అప్పుడు బతుకమ్మ చీరలు పంట పొలాల్లో పిట్టల కావలికి పనికి వచ్చాయన్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలకు రుణాలపై వడ్డీ రాయితీ అందజేస్తోందన్నారు. అందిస్తున్న ఇందిరమ్మ చీరలతో మహిళలకు సంతృప్తి చెందుతుంటే.. ప్రశాంత్‌రెడ్డి అది జీర్ణించుకోవడం లేదన్నారు. జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు అన్ని గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తారన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు జేజే నర్సయ్య, పీసీసీ డెలిగేట్ కుంట రమేష్, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు గోపాల్ నాయక్, యూత్ కాంగ్రెస్ నాయకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మానాల

పొగమంచుతో పరేషాన్



పొగమంచు వాహనదారులను పరేషాన్ చేస్తోంది. ఉదయం 9 అయినా మంచు దుప్పటి పల్లెలను కమ్మేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెడుతోంది. మంచుతో రహదారులు కనిపించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం కమ్మర్‌పల్లి జాతీయ రహదారిపై ప్రయాణాలు సాగించే వాహనదారులు, ఉదయం పనులకు వెళ్లే ప్రజలు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బందులు పడ్డారు. ఇలా రోజూ కొంత మేర ఇబ్బందులు పడుతున్నా పొగమంచుతో ఏర్పడిన ప్రకృతి అందాలను చూసి యువత, చిన్నారులు ఆస్వాదిస్తున్నారు. మంచి దృశ్యాలను సెల్‌ఫోన్లలో బంధిస్తున్నారు. – కమ్మర్‌పల్లి

సంక్షిప్త సమాచారం

నాణ్యమైన ఆహారం తీసుకోవాలి

ముప్కాల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇంటి వద్ద తయారు చేసిన నాణ్యమైన ఆహారాన్ని తీసుకోవాలని ఎంపీడీవో జక్కుల రవి కుమార్ సూచించారు. శుక్రవారం ముప్కాల్ మండలంలోని వేంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విషపూరితమైన జంక్ ఫుడ్, రోడ్డు పక్కన కలుషితమైన ఆహారాన్ని తిని అనారోగ్యం పాలు కావద్దని సూచించారు. విద్యార్థి తల్లిదండ్రులు తయారు చేసిన 200 రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. అమ్మ చేసిన వంటకాలు తింటే ఆరోగ్యం బాగుంటుందని ఈసందర్భంగా విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ముప్కాల్ కాంప్లెక్స్ హెచ్ఎం గంగారాం, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాకేష్, హెచ్ఎం సైవ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇళ్ల డ్రా వాయిదా

ఆర్మూర్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిధిలోని శనివారం నిర్వహించనున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల డ్రాను వాయిదా వేస్తున్నట్లు మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. అనివార్య కారణాల వల్ల ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేస్తున్నామని, తిరిగి ఎప్పుడు డ్రా తీసేది త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు. మునిసిపల్ పరిధిలోని వివిధ వార్డుల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

క్రీడా దుస్తుల వితరణ

నందిపేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ గీతా కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థులకు నిజామాబాద్‌కు చెందిన శ్రీరామ ఎంటర్ప్రైజెస్ వారు క్రీడా దుస్తులను అందజేశారు. అంతేకాకుండా ఈ నెల 30వ వరకు మెదక్ జిల్లాలోని పటాన్‌చెరులో 44వ జూనియర్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొంటున్న నిజామాబాద్ క్రీడాకారులకు సైతం దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బిల్లా అనిల్, అధ్యక్షుడు వీవీ భూమారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండీ అతికుల్లా, కోశాధికారి మధుసుదన్‌రెడ్డి, గీతా కాన్వెంట్ కరస్పాండెంట్ గంగసాగర్, తదితరులున్నారు.

ఐహెచ్ ఐపీ పోర్టల్‌పై అవగాహన

ఆర్మూర్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్ ఐహెచ్ ఐపీ పోర్టల్‌పై ఆసుపత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రతీ ఆసుపత్రిలో ఫార్మసీ, ల్యాబ్‌లలో ఎలా నమోదు చేయాలో సిబ్బందికి వివరించారు. భారత ప్రభుత్వం ద్వారా వచ్చిన ఐహెచ్ ఐపీ పోర్టల్‌లో ఇక నుంచి శిక్షణ పొందిన ప్రతీఒక్కరు రోగుల వివరాలు నమోదు చేయాలని ఆయన సూచించారు. రోగుల వివరాలు నమోదు చేయడం ద్వారా వ్యాధి గురించి ముందే పసిగట్టవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో రెంజర్ల విద్యార్థిని ప్రతిభ

ముప్కాల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ముప్కాల్ మండలం రెంజర్ల ఉన్నత పాఠశాల విద్యార్థిని కే.అంకిత పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఎంఈవో జక్కుల రవి తెలిపారు. ఈ నెల 18 నుంచి 23 తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో జరిగిన ఈ ప్రదర్శనలో పాల్గొన్న 240 ఎగ్జిబిట్స్‌తో పోటీ పడి అంకిత టాప్ 15లో ఎంపికైందన్నారు. ఈ ఫుడ్ ప్రిజర్వేషన్ టాబ్లెట్స్‌కు సంబంధించిన పేటెంట్స్ హక్కులకు దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. గైడ్ టీచర్ మల్లేష్‌ను, విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయ బృందంతో కలిసి శుక్రవారం అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



విద్యార్థిని అంకితను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

భక్తుల కల.. అయ్యప్పకు కోవెల

- ప్రజల సహకారంతో మందిరం అభివృద్ధి
- నవీపేటలో నేటి నుంచి ఉత్సవాలు


నవీపేటలో నిర్మించిన ఆలయం

నవీపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భక్తుల సహకారంతో అయ్యప్ప ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. రూ.కోట్ల మేర ఖర్చు పెట్టి భక్తులే దేవుడి కోసం పనులకు శంకుస్థాపన చేసుకున్నారు. మండల కేంద్రంలోని బాసర రోడ్డు పక్కన ఉన్న 2013 ఫిబ్రవరి 15వ తేదీన అయ్యప్ప స్వామి ఆలయాన్ని నూతనంగా నిర్మించి ప్రారంభించారు. ఇలా కట్టిన ఆలయంలో శనివారం నుం చి కుంభాభిషేక మహోత్సవాలు జరుగనున్నాయి.



కొలువైన అయ్యప్ప

రూ.కోటి విలువైన భూమి విరాళం..

ఆలయ నిర్మాణం కోసం మండలంలోని శివతండాకు చెందిన బన్సీనాయక్ అనే ఆర్టీసీ కంట్రోలర్ సుమారు కోటి రూపాయల విలువైన 22గుంటల భూమిని విరాళంగా అందించారు. ఈ ఆలయాన్ని భక్తుల సహకారంతో సుమారు రెండున్నర కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించి అభివృద్ధి చేశారు. ఆలయాన్ని నిర్మించిన అనంతరం అయ్యప్ప స్వామి విగ్రహాన్ని నిజామాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త మహేష్ అందజేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఉన్న చిన్న దేవాలయాలలో గణపతి మందిరాన్ని నవీపేటకు చెందిన వ్యాపారవేత్త పవన్, నాగదేవత మందిరాన్ని నవీపేటకు చెందిన ప్రశాంత్ రెడ్డి, సుబ్రమణ్య స్వామి ఆలయాన్ని నవీపేట మాజీ సర్పంచ్ ఏటీఎస్ శ్రీనివాస్, మాలికా పురోత్తమ దేవి ఆలయాన్ని నవీపేటకు చెందిన వ్యాపార వేత్త బి.వెంకట రత్నం నిర్మించారు. మూడళ్ల క్రితం ఆలయం ఆవరణలో చిత్రగుప్తుడి మందిరాన్ని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు రూ.4లక్షల సొంత నిధులతో ఆలయాన్ని నిర్మించారు. అలాగే వివిధ గ్రామాలకు చెందిన పలువురు భక్తులు ఆలయ అభివృద్ధికి తమవంతు సహయ, సహకారాలు అందజేశారు. అయ్యప్ప స్వామి ఆలయం నిర్మించి 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

నిర్వహించే కార్యక్రమాలివే..

ఈ నెల 29న మహా గణపతిపూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, గోపూజ, ధ్వజారోహణం, యాగశాల సంస్కరణ, నవగ్రహ మండప దేవత కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ట, లక్ష్మి గణపతి హోమం, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, 30న గణపతి పూజ, పుణ్యాహవచనం, మండప దేవత పూజ, సామూహిక హోమం, సుదర్శన హోమం, సహస్ర కలశ స్థాపన, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాదన వితరణ, అదే రోజు సాయంత్రం 6గంటలకు భక్త మార్కండేయ ఆలయం నుంచి అయ్యప్ప స్వామి ఆలయం వరకు హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వా మి ఊరేగింపు నిర్వహించనున్నారు. చివరి రోజైన సో మవారం గణపతి పూజ, పుణ్యాహవచనం, హవహిత మండప పూజ, అయ్యప్ప స్వామి సహిత పరివార దేవతలు, శిఖర, ధ్వజాస్తంభ, దేవిదేవతల సహస్ర కలశాభిషేకం(మహ కుంభాభిషేకం), లక్ష పుష్పార్చన, బలిప్రదానం, మహపూర్ణాహుతి, అన్నదానం చేపట్టనున్నారు.



రచ్చబండ ముచ్చట్లు

గీ ఎలచ్చన్‌లలో మంచోళ్లని గెలిపిద్దాం

భీమ్‌గల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో గ్రామంలో సర్పంచ్ ఎన్నికలపై అన్ని గ్రామాల్లో రచ్చబండ ముచ్చట్లు మొదలయ్యాయి. ఇందులో భాగంగా ఓ గ్రామంలో రచ్చ బండ ముచ్చట్లు.

రామన్న: ఓ శీనన్న, గంగన్న ఎటు పోతున్నారే.. ఇటు రండి పోదురుగాని

శీనన్న: ఎటు లేదే రామన్న పొలం కాడ నారు పోసిన చూసి రాన పోతున్న. చెప్పు ఏమిటి విషయం.

రామన్న: ఏమున్నది శీనన్న ఈ ప్రభుత్వం సర్పంచ్ ఎలచ్చన్ పెడుతోందట.. మరి ఎట్లా ఈ సారి ఓటు ఎవరికి వేద్దాం!

శీనన్న: అవునే రామన్న ఎలచ్చన్లు ఉన్నాయట మరి ఈ సారి మన ఊరిని బాగు చేసేటోళ్లకు ఓటేద్దామే, ఏమంటావే గంగన్న

గంగన్న: అవునే శీనన్న.. రామన్న మన ఊరిని బాగు చేసేటోనికి మంచిగా చదువుకున్నోళ్లకు ఓటేసి గెలిపిద్దాము.

రామన్న: ఆ ఏమ్రా.. కిషన్! ఎప్పుడు వస్తున్నావురా. అంత మంచిదేనా.. దుబాయ్ నుంచి ఇంత తొందరగా వచ్చినావ్ ఏంది!

కిషన్: అవునే రామన్న, శీనన్న, గంగన్న ఇప్పుడు వచ్చిన బస్సుకు వస్తున్ననే తొందరగా వచ్చినా, ఇక్కడ సర్పంచ్ ఎలక్షన్లు ఉన్నాయి కదా అందుకనే వచ్చిన ఇక ఇంటి వద్దకు పోయొస్తా

శీనన్న: అవునే రామన్న ఈ కిషన్ గాడు దుబాయ్ పోయింది మొన్ననే ఇప్పుడు గీ సర్పంచ్ ఎలచ్చన్లు అనగానే వచ్చిండు పోటీ చేస్తాడేమో

గంగన్న: లేదే రామన్న.. కిషన్ గాడు సర్పంచ్, ఎంపీటీసీ ఎలచ్చన్లు ఉంటే దుబాయ్ నుంచి వస్తాడు. వాడు పోటీ చేయడు కానీ మన ఊరు వాళ్లందరికీ అభివృద్ధి చేసేటు వంటి వారికి ఓటు వేద్దామని ప్రజల్లో చైతన్యం తెస్తాడు.

రామన్న: అవునే అన్నలు గిట్లాంటి పిల్లగాండ్లు ఉంటే మనం కూడా వాళ్లకు కొంచెం సపోర్ట్ చేద్దామే. ఎందుకంటే మంచోళ్ళని సర్పంచ్ గెలిపించుకుంటే మన ఊరే బాగుపడ్తది.

శీనన్న: ఇంకా ఏం సంగతి రామన్న, గంగన్న కోతలు అయిపోయినాయా, వడ్లు పోయాయా

గంగన్న: అయినయే శీనన్న ఆటో పోయినాయి పైసలు కూడా వచ్చినాయి. ఈ సారి ఏందో గాని బోనస్ పైసలు కూడా జల్ది వచ్చినయ్.

శీనన్న: రామన్న, గంగన్న పొలం కాడా నారు పోసిన జర పని ఉన్నది. పొలం దాకా పోయి వస్తా. ఏదేమైనా ఈ త్యాప పైసలు పంచే టోళ్లని కాకుండా పనిచేసేటోన్ని గెలిపించుకుందామే.

అందరిమాట ఒక్కటే

రూప్లానాయక్ తండా సర్పంచ్‌గా సిరినా బలరాం

వర్ని/నాగిరెడ్డిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సర్పంచ్ స్థానాలను ఏకగ్రీవం చేయడానికి స్థానిక నేతలు ప్రయత్నిస్తున్నారు. గ్రామాల్లోని మెజారిటీ వర్గాలతో తీర్మానం చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం రూప్లా నాయక్ తండా సర్పంచ్‌గా సిరినా బలరాంను శుక్రవారం గ్రామస్థులంతా ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు తీర్మానించారు.



సిరినా బలరాంను తీర్మానించిన దృశ్యం



మాసానిపల్లి సర్పంచ్‌గా సునంద

నాగిరెడ్డిపేట మండలంలోని మాసానిపల్లి సర్పంచ్ పెద్దపట్లోల్ల సునందతో పాటు 8వ వార్డు సభ్యులందరినీ గ్రామస్థులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తీర్మానించారు.

సామాజిక న్యాయం, వివక్షకు వ్యతిరేకంగా పోరాడుదాం



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నిజామాబాద్ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం, వివక్షతకు వ్యతిరేకంగా పోరాడ టమే జ్యోతిబాపూలేకు మనమిచ్చే నిజమైన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం రమేష్‌బాబు మాట్లాడుతూ దేశంలో వివక్షత, అంటరానితనం రూపుమాపేలా ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. బడుగు బలహీన వర్గాలను చైతన్యవంతం చేస్తూ అనేక ఉద్యమాలు నిర్వహించినట్లు తెలిపారు. సమాజంలో మహిళల పట్ల చులకన భావం, వివక్షత పోవాలంటే చదువు ద్వారా విజ్ఞానవంతులను చేయ వచ్చన్నారు. వివక్షతకు వ్యతిరేకంగా సావిత్రిబాయి పూలే పోరాటాలు చేశారన్నారు. నేటి పాలకులు బలహీన వర్గాలకు రిజర్వేషన్ల అమలులో తమ ఆధిపత్య ధోరణి పోతుందని దాటవేస్తున్నారని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ పోరాడినప్పుడే నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని రమేష్‌బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులునూర్జహాన్, శంకర్ గౌడ్, నాగరాజు, సుజాత, విగ్నేష్, వై.గంగాధర్, అనిత, చక్రి తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిబా పూలేకు కాంగ్రెస్ నాయకుల నివాళులు



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు గోవిందరావు పూలే వర్ధంతి సందర్భంగా నగరంలోని హనుమాన్ జంక్షన్‌లోని పులే విగ్రహానికి కాంగ్రెస్ ఒబీసీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఓబీసీ అధ్యక్షుడు రాజనరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. దేశ సామాజిక చరిత్రలో చిరస్థాయిగా నిలిచే మహనీయుల్లో మహాత్మా జ్యోతిరావు పూలే ఒకరని, సమాజంలో అణగారిన వర్గాల అక్షరాస్యత, సమానత్వం, మహిళా సాధికారత కోసం జీవితాంతం పోరాడిన ఆయన పోరాట పటిమ స్ఫూర్తిదాయకం అన్నారు.

కుల వ్యవస్థను శాస్త్రీయంగా విశ్లేషించిన తత్వవేత్త ..

సిరికొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కుల వ్యవస్థను శాస్త్రీయంగా విశ్లేషించి అమానుషతను బహిర్గతం చేసిన తొలి సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిరావు పూలే అని సత్యశోధక్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ఆర్.నర్సయ్య అన్నారు. సిరికొండలో మహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సహచర ఉపాధ్యాయులతో కలిసి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. సమాజంలోని అన్యాయాలను ఎదిరించడానికి విద్యనే ఆయుధంగా ఎంచుకుని అస్పృశ్యత, మహిళలపై వివక్షతను రూపుమాపడానికి పాఠశాలలను ఏర్పాటు చేసిన మహనీయుడని కొనియాడారు. పూలే సావిత్రీబాయి దంపతులు ప్రారంభించిన బాలిక విద్యోద్యమం భారత విద్యా చరిత్రలోనే అతిపెద్ద సామాజిక పునర్నిర్మాణ ఉద్యమమని నర్సయ్య గుర్తు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, సామాజిక అవగాహన క్విజ్ పోటీల విజేతలకు నర్సయ్య బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా విద్యను ప్రోత్సహించిన మహనీయుడు..

సుభాష్‌నగర్: మహిళా విద్యను ప్రోత్సహించిన గొప్ప వ్యక్తి మహాత్మ జ్యోతిబా పూలే అని బీసీ సంక్షేమ సంఘం నరాల సుధాకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని హనుమాన్ జంక్షన్‌లో గల విగ్రహాల పార్కు వద్ద జ్యోతిబా పూలే వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబా పూలే కేవలం బడుగు బలహీన వర్గాలకే సేవచేయలేదని గుర్తు చేశారు. సమాజంలో వెనకబడిన ప్రతీ ఒక్కరి గురించి పోరాడిన నాయకుడు మహాత్మ జ్యోతిబా పూలే అన్నారు. అగ్ర వర్ణాల పేదలకు, వితంతువుల కొరకు పోరాడిన ఏకైక వ్యక్తి మహాత్మజ్యోతిబాపూలే అని గుర్తుచేశారు. భార్యకు విద్యనేర్పి భారతదేశ ప్రథమ ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దిన గొప్ప దార్శనీకుడు అన్నారు.

విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో..

జ్యోతిబాపూలే చూపించిన సమానత్వమార్గంలో నడవాలని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఏబీవీఎస్‌యూ, ఆర్‌ఎస్‌పి, ఆర్‌వైఎఫ్ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో గల పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళు అర్పించారు.

పత్తి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

▸ నాణ్యమైన పత్తికే గిట్టుబాటు ధర ▸ నిర్లక్ష్యం చేస్తే తీవ్రంగా నష్టం



మద్నూర్ మార్కెట్‌కు వచ్చిన పత్తి

మద్నూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వాతావరణంలో అతివృష్టి, అనావృష్టి వల్ల పత్తి దిగుబడి అం తంత మాత్రమే వచ్చింది. వచ్చిన కాస్త పత్తిని నాణ్యతగా మార్కెట్‌కు తరలిస్తేనే గిట్టుబాటు ధరకు లభిస్తుంది. ఈ విషయంలో రైతులు ఏ మాత్రం నిర్లక్ష్యం చేసిన పెద్ద ఎత్తున నష్టపోవాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. చేను లో పత్తి పూర్తిగా విచ్చుకొని ఆరి న తర్వాత ఏమాత్రం తేమాలేని సమయంలో పత్తిని ఏరాలీ. తర్వాత నీడలో ఒకటి రెండు రోజు లు ఆరబెట్టాలి. పూర్తిగా ఎండలో ఆరబెట్టడం వల్ల నాణ్యత తగ్గే అవకాశం ఉంటుంది. రెండు రోజులు నీడలో ఆరబెట్టిన తర్వాత బస్తాల్లో కానీ విడిగా గదిలో గాని నిలువ చేయడం వల్ల ఎ లాంటి తేమ పెరగదు. చేనులో పత్తి ఉన్న సమయంలో వర్షాలు కురిస్తే వెంటనే పత్తి తీయకుండా నాలుగు రోజులు చెట్టు మీదనే పూర్తిగా ఆరేలా చూ డాలి. ఆ తరువాత పత్తి తీయాలి. ఎక్కువ తూకం వస్తుందని నీటిని కలిపి తీసుకురావడం వల్ల అసలుకే మోసం వచ్చే ప్రమాదం ఉంటుంది. నీటిని కలపడం వల్ల రంగు మారి నాణ్యత తగ్గిపోతుంది. ఒక టి రెండు కిలోల తూకం కోసం ఆశపడి మొత్తం పత్తిని నాశనం చేసుకోవద్దు. నాణ్యమైన పత్తిని తీసుకురావడం వల్ల మంచి ధర పొందవచ్చు. పత్తిని ఉదయం సాయంత్రం సమయంలో కాకుండా కొద్ది గా ఎండ ఉన్న సమయంలో తీయాలి. ఎలాంటి పత్తిని తీయాలనే విషయంలో కూలీలకు ముందుగానే సలహాలు ఇవ్వాలి. మంచి పత్తి, గుడ్డి పత్తిని వేరువేరుగా తీసేలా చూడాలి. వేరువేరుగా మార్కెట్ కు తీసుకురావాలి. వివిధ రకాలైన పత్తిని కలుపరాదు. ఎందుకంటే అన్ని రకాల పత్తి గింజలు ఒకేలా ఉండవు. రంగుల్లో తేడాలుంటాయి. చూడగానే వ్యాపారులకు అనుమానం వస్తుంది. అందువల్ల ఏ రకానికి ఆ రకం మార్కెట్‌కు తీసుకువెళ్లాలి.

పత్తిలో తేమ శాతం మద్దతు ధర
8 శాతం తేమ ఉన్నట్లయితే రూ. 8,110
9 శాతం ఉన్నట్లయితే రూ.8028
10 శాతం ఉన్నట్లయితే రూ.7,947
11 శాతం ఉన్నట్లయితే రూ.7,866
12 శాతం ఉన్నట్లయితే రూ.7,785

తేమ శాతం ముఖ్యం

పత్తి ఖరీదు చేసే సమయంలో తేమ శాతాన్ని ప్రధానంగా పరిగణలోకి తీసుకుంటారు. 8 శాతం తేమ ఉంటే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లిస్తుంది. పత్తిలో తేమశాతం తెలుసుకోవడానికి అధికారులు ప్రత్యేక పరికరాన్ని వినియోగిస్తారు. ఈ పరికరం పొడవు 18 అంగుళాలు రెండు కడ్డీలకు ఉన్న తీగల ద్వారా డిజిటల్ మీటర్‌కు అనుసంధానం చేసి ఉంటుంది. రెండు కడ్డీలు పత్తిలో గుచ్చిన సమయంలో డిజిటల్ మీటర్ పత్తిలో తేమ శాతాన్ని అంకెల రూపంలో చూపిస్తుంది. తేమ విషయంలో కొంత సడలింపు ఇవ్వాలని రైతుల పక్షనా కాటన్ అసోసియేన్ ప్రతినిధులు ఇప్పటికే కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దానిని 10 శాతానికి పెంచాలని కోరుతున్నారు. అదేవిధంగా ఎనిమిది నుంచి 12 వరకు తేమ శాతం ఉన్న పత్తిని సిసిఐ కొనుగోలు చేస్తుంది. అలా కాకుండా 12 నుంచి 18 వరకు తేమశాతం ఉన్న పత్తిని కూడా సీసీఐ కొనుగోలు చేయాలని రైతుల పక్షానా కాటన్ అసోసియేషన్ కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది.

సీసీఐ నిబంధనలు ఇవే

నాణ్యతలేని, రంగు మారిన, వర్షానికి తడిసిన పత్తిని సిసిఐ కొనుగోలు చేయదు. పత్తి రైతులందరూ సంబంధిత ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పత్తి రైతులకు చెల్లింపు నేరుగా వారి ఆధార్ లింక్ చేయబడిన బ్యాంక్ ఖాతాలోకి మాత్రమే జమ చేస్తుంది. అందువల్ల పత్తి రైతులు తమ బ్యాంకు ఖాతాను ఆధార్ లింకు చేసుకోవాలి.

సీనియర్ తెలుగు ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి



వేల్పూర్‌లో కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజన్నకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వేల్పూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): 2010 కన్న ముందు ఉన్న సీనియర్ తెలుగు ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని వేల్పూర్, భీమ్‌గల్ కాంప్లెక్స్ పాఠశాలల తెలుగు ఉపాధ్యాయులు శుక్రవారం వేల్పూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజన్నకు వినతి పత్రం అందజేశారు. ఎవరి విషయాల వారిగా వారు వారి సబ్జెక్టును ఎక్కువ మార్కులు కేటాయించి పేపర్లు తయారు చేయాలని పేర్కొన్నారు. అందరికి సీనియర్ ఉపాధ్యాయులకు ప్రతీ పేపర్‌లో పాస్ మార్కులు 40 పరిగణించి పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ కార్యదర్శి వీణ, బాగ్యలక్ష్మి, వేల్పూర్, భీమ్‌గల్ మండలాల సీనియర్ తెలుగు ఉపాధ్యాయులు సీహెచ్ కాంతయ్య, శ్రీనివాస్, ధర్మపురి, తిరుపతి, సాగర్, రాములు, మారుతి, రమాదేవి, గోదావరి, విజయలక్ష్మీ, శ్యామ్ చరణ్, వినోద శ్రీ, సుమలత, వసంతరాణి, తదితరులున్నారు.

మానాల మోహన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన హనుమాన్‌తండా యువకులు



యువకులకు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మానాల

కమ్మర్‌పల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్లా జిల్లా రుద్రంగా మండలం మానాల అనుబంధ గ్రామం హనుమాన్ తండాకు చెందిన పలువురు యువకులు శుక్రవారం రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీనుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ ఖండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామీణ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తు ప్రభుత్వం అదంజేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సానుభూతి పరులను సర్పంచ్‌లుగా గెలిపించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వినోద్, తూం జలపతి, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆది మల్లన్న స్వామికి భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు



పడిగెల ఆదిమల్లన్న స్వామికి నైవేద్యాలతో బారులు తీరిన మహిళలు

వేల్పూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడిగెల గ్రామంలో ఆది మల్లన్న స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆది మల్లన్నకు నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఉదయం నుంచి ఆలయం వద్ద నైవే ద్యాలతో బారులు తీరి మహిళలు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో బాలకిషన్, పంచాయతీ కార్యదర్శి సజన్ కుమార్‌లు ఆదిమల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

టీయూకు రూ.200 కోట్ల నిధులు విడుదల చేయాలి

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీకి రూ.200 కోట్ల నిధులు విడుదల చేయాలని పీడీఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.అనిల్‌కుమార్ అన్నారు. డిచ్‌పల్లిలోని టీయూ యూనివర్సిటిలో శుక్రవారం లా కాలేజ్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటిలోని ప్రధాన క్యాంపస్‌ల కోసం రూ. 200 కోట్ల నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహిళా వసతి గృహాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. నిర్మాణం పూర్తయిన సైన్స్ కళాశాల భవనాన్ని ప్రారంభించాలన్నారు. తెలంగాణ యూనివర్సిటీ మసక బారేల ఇటీవల అనేక పరిణామాలు జరిగాయన్నారు. ఇకనైనా వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్‌లు యూనివర్సిటిలో అకాడమిక్ వాతావరణాన్ని పెంపొందించేలా చర్యలు తీసు కోవాలన్నారు. యూనివర్సిటీ విద్యార్థుల పరిరక్షణ కోసం పీడీఎస్‌యూ రాజీలేకుండా పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకులు నితిన్, చరణ్, నగేష్, దేవి, నిఖిత, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డిబార్

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు డిబార్ అయినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంటా చంద్రశేఖర్ తెలిపారు. 8వ రోజు జరిగిన పరీక్షల్లో ఉదయం జరిగిన పరీక్షలకు 2199 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 2037 మంది విద్యార్థులు హాజరయ్యారని 161 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో 4775 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 4544 మంది వి ద్యార్థులు హాజరయ్యారని 230 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు డిబార్ అయినట్లు తెలిపారు.

ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

▸ మొదటి స్థానం దక్కించుకున్న ఖమ్మం, నిజామాబాద్ జట్లు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

ధర్మారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో మూడు రోజులుగా కన్నులపండవగా జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు వేడుకకు హాజరైన జిల్లా విద్యాధికారి శారద జిల్లా యువజన క్రీడ అధికారి ఏ సురేష్‌తోకలిసి విజేతలకు బహుమతులను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడలు శారీర ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని అన్నారు. తెలంగాణలోని 10 ఉమ్మడి జిల్లాల నుంచి 244మంది ఈ టోర్నీలో పోటీపడగా లీగ్, సెమీ ఫైనల్స్ అనంతరం ఆరు జట్లు ఫైనల్‌కు చేరాయి. శుక్రవారం ఉదయం జరిగిన ఫైనల్ మ్యాచుల్లో బాలుర విభాగంలో ఖమ్మం జట్టు మొదటిస్థానం సాధించగా, బాలికల విభాగంలో నిజామాబాద్ జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. బాలుర విభాగంలో రెండో స్థానంలో వరంగల్ జట్టు సాధించగా మూడవస్థానంలో రంగారెడ్డి జట్టు నిలిచింది. బాలికల విభాగంలో రెండవ స్థానం మహబూబ్‌నగర్ జిల్లా జట్టు సాధించగా మూడో స్థానాన్ని కరీంనగర్ జట్టు దక్కించుకుంది. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల నిర్వాహణకు కృషిచేసిన ధర్మారం మండల విద్యాధికారి పి. ప్రభాకర్‌ను, టోర్నమెంట్ ఆర్గనైజర్ బైకని కొమురయ్యను ముఖ్యఅతిథులు అభినందించారు. కార్యక్రమంలో ఏఎంవో షేక్, పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తమ్ముడు రాజయ్య, ప్రిన్సిపాల్ విద్యాసాగర్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, లయన్స్ క్లబ్ సభ్యులు తన్నీరు రాజేందర్, ఇప్ప మల్లేశం, రవీందర్ శెట్టి, గిన్నె లక్ష్మణ్, వ్యాయామ ఉపాధ్యాయులు వేల్పుల సురేందర్, దాసరి రమేష్, టి. సౌజన్య, కుమార్, మమత పాల్గొన్నారు.

నసురుల్లాబాద్ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా సాయాగౌడ్



నసురుల్లాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా శుక్రవారం మంతపురి సా యాగౌడ్‌ను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సాయాగౌడ్ మాట్లాడుతూ నసురుల్లాబాద్ గ్రామ అభివృద్ధి కోసం తన వంతుగా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి, తనను గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సాయాగౌడ్‌ను గ్రామస్థులు శాలువాతో సత్కరించారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

▸ డీసీసీబీ మాజీ చైర్మన్ భాస్కర్ రెడ్డి



కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న పోచారం భాస్కర్ రెడ్డి

బీర్కూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో నిలిచే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలునిచ్చారు. శుక్రవారం బీర్కూర్ మండలం భైరాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జోగు నర్సింలు, పందుల సుధాకర్, గుడికొండ సాయిలు, కొండు పండరి, తుకారాం, కమ్మరి బాబు, దుర్గయ్య, హన్మాండ్లు, కొంద్ర రాములు, పోతురాజు రాజు, నిరుడి రాజు, లస్మాపురం దశరథ్‌లతో పాటు కార్యకర్తలు పెద్దఎత్తున భాస్కర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సం క్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శశికాంత్, బసవరాజు, రాములు, దుంపల రాజు, రఘు, మొగలు గోండ, విజయ్, నారాయణ, లక్ష్మయ్య, పండరి పటేల్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప సేవా ట్రస్టుకు విరాళం



అయ్యప్ప దీక్ష గురుస్వాములకు విరాళం అందజేస్తున్న భక్తులు

బాన్సువాడటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ అయ్యప్ప నిత్యాన్నదాన సేవా ట్రస్టుకు శుక్రవారం దాతలు విరాళాలను అందజేశారు. శ్రవణ్‌కుమార్ 11,116 రూపాయలు విరాళం, స్వరూప అన్నప్రసాద వితరణ కోసం 25 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా బెజుగం శంకర్ మాట్లాడుతూ దాతల సహకారంతో బాన్సువాడ అయ్యప్ప ఆలయంలో నిత్యాన్నదాన యజ్ఞం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అర్షపల్లి సాయిరెడ్డి, తాటి ప్రశాంత్, చిదుర సుధాకర్, చిదుర సురేందర్, ఉడుగుల సంజీవ్ కుమార్, చిదుర సచిన్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ భిక్షపతి, పాల్గొన్న ఎస్సై

ర్యాలీలకు అనుమతులు తప్పనిసరి

ధర్పల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల సందర్భంగా ర్యాలీలకు అనుమతులు తప్పనిసరని, అనుమతి లేకుండా నిర్వహిస్తే క్రిమినల్ కేసులు తప్పవని సీఐ భిక్షపతి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీఐ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల డీజే యజమానులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎవరైనా అభ్యర్థులు ర్యాలీలు నిర్వహించాలనుకుంటే సంబంధిత రిటర్నింగ్ అధికారితో పాటు పోలీస్ అధికారుల అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళి పాటించి సజావుగా ఎన్నికలు జరిగేందుకు సర్కిల్ పరిధిలోని ధర్పల్లి, సిరికొండ మండలాలకు చెందిన ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలన్నారు. ఎన్నికల సందర్భంగా డీజేలకు ఎలాంటి అనుమతులు ఉండవని డీజేలు పెడితే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు స్వేచ్ఛాయుతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో ధర్పల్లి ఎస్సై ఎం.కళ్యాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.3.25 లక్షలు



హుండీ లెక్కిస్తున్న దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న నీలకంఠేశ్వర ఆలయ హుండీని శుక్రవారం దేవాదాయ శాఖ అధికారులు లెక్కించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయరామారావు పర్యవేక్షణలో జరిగిన హుండీ లెక్కింపులో రూ.3,25,511 ఆదాయం సమకూరింది. నోట్ల రూపంలో రూ.2,80,500 రాగా, నాణెల రూపంలో రూ.45,011 ఆదాయం వచ్చింది. హుండీ లెక్కింపులో ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీరాం రవీందర్‌గుప్త, ఆలయ కమిటీ చైర్మన్ సిరిగి తిరుపతి, డైరెక్టర్లు నందకిశోర్, నర్సింగ్‌రావు, అర్చకులు సుహాస్ శఖాయ్, మకరంద్ శఖాయ్, నీలేష్, శేఖర్, సిబ్బంది ఉన్నారు.

సాదాబైనామా అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

» కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో ఆయా మండలాల వారీగా సాధించిన ప్రగతిని పరిశీలించారు. సాదాబైనామా పెండింగ్ దరఖాస్తుల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీలను తిరస్కరించినట్లయితే అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి

రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలి

ఇందూరు: రోడ్డు మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రధాన రహదారుల మరమ్మతులను క్షేత్రస్థాయిలో కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద, బైపాస్ రోడ్డు మార్గంలో, డిచ్పల్లి రైల్వే స్టేషన్ ఎదురుగా ప్రధాన రహదారిపై కొనసాగుతున్న రోడ్ల మరమ్మతు పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తి చేయించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. నగరంలో గోల్ హనుమాన్ నుంచి పూసలగల్లీ మార్గంలో రోడ్డు మరమ్మతులు చేపట్టాల్సి ఉన్న ప్రాంతాలను సైతం కలెక్టర్ తనిఖీ చేశారు. పనులను ఇంకనూ ప్రారంభించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్అండ్‌బీ అధికారి ప్రవీణ్, నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ రవీంద్రసాగర్ తదితరులు ఉన్నారు.

ముసాయిదా విత్తన బిల్లు-2025 పై అభిప్రాయాల సేకరణ

సుభాష్‌నగర్: వ్యవసాయ శాఖ ద్వారా రూపొందించిన ముసాయిదా విత్తన బిల్లు -2025 పై శుక్రవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ అధికారులతో పాటు రైతు ప్రతినిధులు, విత్తన డీలర్లు, కంపెనీలు, విత్తన ఉత్పత్తిదారులతో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ముసాయిదా విత్తన బిల్లులోని అంశాలపై అభిప్రాయాలను సేకరించారు. నాసిరకం విత్తనాల కారణంగా పంట ఉత్పత్తి, విక్రయ దశలో రైతులకు నష్టం కలిగితే నిర్ణీత కాల పరిమితితో రైతులకు చట్టబద్ధంగా నష్ట పరిహారం అందించేలా నిబంధనలపై చర్చించారు. విత్తన ఉత్పత్తి కార్యకలాపాలకు సంబంధించి స్పష్టమైన, సమర్థవంతమైన నియంత్రణ వ్యవస్థను బిల్లులో చేర్చడం, పత్తి, వరి, పప్పు ధాన్యాలు, మొక్కజొన్న, కూరగాయలు తదితర విత్తనాల ఉత్పత్తి, విక్రయ ధరల నియంత్రణ కోసం నిబంధనలు, విత్తన విక్రయదారుల లైసెన్సింగ్ వ్యవస్థ, మార్గదర్శకాలు, సీడ్ టెస్టింగ్, విత్తనాల దిగుమతి, విత్తన ప్రాసెసింగ్ యూనిట్ల నియంత్రణలో ఉన్న లోపాల సవరణ తదితర అంశాలపై సమావేశంలో కూలంకషంగా చర్చించారు. ముసాయిదా విత్తన బిల్లుపై సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వానికి పంపిస్తామని కలెక్టర్ తెలిపారు.

శాస్త్రీయ విద్యా విధానం కోసం ఉద్యమించాలి

» ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా ఉపాధ్యక్షురాలు శిల్ప



శిల్పకు జ్ఞాపికను అందజేస్తున్న నాయకులు

ఇందూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ విద్యావిధానం కోసం విద్యార్థులు ఉద్యమించాలని అమ్మాయిలకు అసమానతలు లేని విద్యను అందించాలని ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా ఉపాధ్యక్షురాలు శిల్ప అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా ఉపాధ్యక్షురాలు శిల్ప మాట్లాడారు. నూతన జాతీయ విద్యావిధానం వల్ల తీవ్ర నష్టం ఉందని, వెంటనే దానిని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అమ్మాయిలకు రక్షణ కల్పిస్తూ ఏర్పర్చిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. రాజ్యాంగానికి బదులు మనుస్మృతిని అమలు చేయాలని చూస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. యూనివర్సిటీలో ఎల్‌వోసిఎఫ్ పేరుతో ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. విద్యా కాషాయికరణ వ్యతిరేకంగా అమ్మాయిలు పోరాటం చేయాలన్నారు. విద్యారంగానికి ఇప్పటికి విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర గర్ల్ కన్వీనర్ పూజ, కో కన్వీనర్ మమత, దీపిక, రమ్య, సుమ, జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్, నాయకులు పాల్గొన్నారు.



గుంతల్లో మొరం పోయిస్తున్న ట్రాఫిక్ పోలీసు

హమ్మయ్యా.. గుంతలు పూడ్చారు..!

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అర్సపల్లి వద్ద రోడ్డుపై గుంతలను ట్రాఫిక్ పోలీసులు పూడ్చారు. పెద్దపెద్ద గుంతలతో వాహనదారులు రోజూ ఇబ్బందులు పడేవారు. ట్రాఫిక్ ఇబ్బందులు సైతం తలెత్తుతుండటంతో ఏఆర్ ఎస్సై కోటేశ్వర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ పవన్‌కుమార్ మొరం పోయించి రోడ్డు మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులు చేయించిన కోటేశ్వర్‌రావు, పవన్‌లను ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అభినందించారు.

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్

ఇందూరు, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సమక్షంలో శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ రెవెన్యూ డివిజన్లలోని ఒక్కో మండలం వారీగా ఆయా పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధులకు ఎంపిక చేశారు. జిల్లాలోని 545 గ్రామ పంచాయతీల సర్పంచ్, 5022 వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకొని ర్యాండమైజేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, డీపీఓ శ్రీనివాస్‌రావు, నోడల్ అధికారి పవన్‌కుమార్ తదితరులున్నారు.

టీ-పోల్ యాప్‌ను వినియోగించుకోవాలి

సుభాష్‌నగర్,నవంబరు28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల సౌలభ్యం కోసం అందుబాటులోకి తెచ్చిన టీ-పోల్ మొబైల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. టీ-పోల్ యాప్ ద్వారా ఓటర్లు తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉందనే వివరాలను పరిశీలించుకోవడంతో పాటు, ఓటరు స్లిప్‌ను డౌన్లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే యాప్ ద్వారా ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఏవైనా అభ్యంతరాలుంటే, వాటిని కూడా తెలియజేయవచ్చని వివరించారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు ఎంపీడీఓలకు చేరుతాయని, వాటిని పరిశీలించి తక్షణమే పరిష్కరిస్తారని కలెక్టర్ తెలిపారు.

'వెల్‌నెస్'లో అరుదైన చికిత్స



సమావేశంలో మాట్లాడుతున్న వెల్‌నెస్ ఆసుపత్రి వైద్యులు

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెల్‌నెస్ ఆసుపత్రిలో అరుదైన కిడ్నీ శస్త్ర చికిత్స నిర్వహించారు. కుడివైపు కిడ్నీ పాక్షిక నెఫ్రెక్టమి శస్త్ర చికిత్స చేసి సగం కిడ్నీని కాపాడడం వెల్‌నెస్ యూరాలజి ఆసుపత్రి వైద్యులు ఎలసాని ప్రశాంత్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని ఖలీల్‌వాడిలో గల వెల్‌నెస్ ఆసుపత్రిలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎలసాని ప్రశాంత్ మాట్లాడుతూ.. గాంధారికి చెందిన మద్దెల కాశయ్య పది రోజుల క్రితం వెల్‌నెస్ ఆసుపత్రికి రాగా అన్ని రకాలుగా వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. వైద్య పరీక్షల్లో భాగంగా కిడ్నీలో కొంత వరకు క్యాన్సర్ గడ్డలాగా ఏర్పడడంతో పూర్తిగా కిడ్నీని తొలగించకుండా ఎక్కడైతే క్యాన్సర్ గడ్డ ఏర్పడిందో ఆ భాగాన్ని తొలగించామన్నారు. మిగతా సగంతో యథావిధిగా కిడ్నీ ఫంక్షనింగ్ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఉపాధ్యక్షుడు బోదు అశోక్ కుమార్ మాట్లాడుతూ.. 60 సంవత్సరాల వయసు దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కిడ్నీలో సగభాగాన్ని తొలగించి మిగతా సగభాగంతో ఆయనను కాపాడామన్నారు. ఎమర్జెన్సీ శస్త్రచికిత్స చాలా తక్కువ ఖర్చుతో అంతర్జాతీయ ప్రమాణాలతో వైద్యం అందించడమే లక్ష్యంగా నిజామాబాద్ కేంద్రంలో వెల్‌నెస్ ఆసుపత్రి స్థాపించడం జరిగిందన్నారు. హైదరాబాద్ వెళ్లకుండా అతి తక్కువ ఖర్చుతో సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆపరేషన్ హెడ్ హరికృష్ణగౌడ్, వెల్‌నెస్ ఆసుపత్రి మేనేజర్ సతీష్, కాశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ పవన్‌కుమార్

మోపాల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పీ.ఎం.శ్రీ కార్యక్రమాలలో భాగంగా చైల్డ్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీలో ఆన్‌లైన్ సేఫ్టీ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామీణ బ్యాంకు మేనేజర్ వై.పవన్ కుమార్ హాజరై విద్యార్థినులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాల నుంచి ఎలా రక్షించుకోవాలో, ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. వాట్సప్‌లలో వచ్చే తెలియని లింక్‌లపై క్లిక్ చేయకూడదని సూచించారు. పిల్లలు ఇంటర్నెట్‌ను సురక్షితంగా ఉపయోగించాలని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.విజయలలిత మాట్లాడుతూ.. పీ.ఎం.శ్రీలో భాగంగా పాఠశాలలో ఎన్నో రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దీని వల్ల విద్యార్థులు ఎన్నో ఉపయోగపడే విషయాలు తెలుసుకుంటున్నారని పేర్కొన్నారు. సోషల్ మీడియాను జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని, వ్యక్తిగత సమాచారాన్ని గుర్తు తెలియని వ్యక్తులతో పంచుకోకూడదని ఆమె సూచించారు. వ్యక్తిగత డేటా చోరీకి గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు. సైబర్ మోసాల గురించి ఇంట్లోని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వారిని అప్రమత్తం చేసి ఎలాంటి ప్రమాదం జరగక ముందే జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వీపీ రూపాని, జేవీపీ సునీత, కల్పన, ఉపాధ్యాయక సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

జనరల్ స్థానాల్లో బీసీలు పోటీ చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌ల రిజర్వేషన్ జనరల్ స్థానంలో బీసీలు పోటీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు రాకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. 50శాతం జనరల్ స్థానాలు కేటాయించారని జనరల్ స్థానంలో బీసీలు పోటీ చేసి గెలుపొందాలని పేర్కొన్నారు. ప్రతి ఊరిలో బీసీలందరూ ఏకమై బీసీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. జనరల్ స్థానాల్లో బీసీలను గెలిపించినపుడు బీసీలకు ద్రోహులకు తగిన గుణపాఠం చెప్పినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాకిషన్, ప్రసాద్, దర్శనం దేవేందర్, శంకర్, శ్రీలత, బగ్గిలి అజయ్, బసవ సాయి, వాసం జయ, తదితరులు పాల్గొన్నారు.

పూలే త్యాగం మరువలేనిది



రామన్నపేట్‌లో నివాళులు అర్పిస్తున్న బహుజన సంఘాల నాయకులు

వేల్పూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం రామన్నపేట్‌లో అంబేద్కర్ సంఘం, బీసీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే 135వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిబాపూలే చిత్రపటానికి ఆయా సంఘాల సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బడుగు బలహీన వర్గాల ఆశజ్యోతి బాపు జ్యోతిబాపూలే పోరాటం, త్యాగం మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఏవైఎస్ ప్రధాన కార్యదర్శి జాంబవ చామర్, ఉపాధ్యక్షుడు డి. సుమన్, కార్యదర్శి బి. రణవీర్, బీసీ సంఘం నాయకులు ఈర్ల కిషన్, పల్లికొండ కిషన్, ఆయా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ధర్పల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని డివిజనల్ ఇంజనీర్ సీహెచ్.హరిచంద్ తెలిపారు. 220కెవి డిచ్‌పల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అన్నారు. ధర్పల్లి, జక్రాన్‌పల్లి, ఇందల్వాయి, డిచ్‌పల్లి మండలాలకు, వాటి పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఇట్టి విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి, పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో అశోక్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రవేశాల కోసం అపరాధ రుసుంతో నవంబరు 29 నుంచి 7వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఈ ప్రవేశ రుసుమును ఆన్‌లైన్ మీసేవా సెంటర్‌లో చెల్లించవచ్చని తెలిపారు. మిగతా వివరాల కోసం కోఆర్డినేటర్ రవిందర్ 9908896096 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1న జరిగే డిప్లొమా ఇన్ ఎలిమెంటరి పరీక్ష కేంద్రాల వద్ద అండర్ సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్‌ను అమలు చేస్తున్నట్లు పోలీసు కమిషనర్ సాయిచైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని పరీక్ష కేంద్రాల వద్ద డిసెంబరు 1 నుంచి 6 వరకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగుతున్నాయన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. ఇద్దరు అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు పరీక్ష కేంద్రాల వద్ద గుమికూడరాదని తెలిపారు. అన్ని జిరాక్స్ సెంటర్‌లుఉదయం8-10వరకు మూసేయాలన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద రెడ్లకోసం రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటుచేయాలని రెడ్డి ఐక్య వేదిక స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణాకర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుపై చర్చించారు. గత పదేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశామని త్వరలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న చీమన్‌పల్లి నాయకులు

నిజామాబాద్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న వేళ పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నుంచి పెద్దసంఖ్యలో కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. శుక్రవారం సిరికొండ మండలంలోని చీమనపల్లికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు 50 మంది కాంగ్రెస్‌లో చేరారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే సూచించారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌పై కాంగ్రెస్ నాయకుల విమర్శలు సరికాదు

» రూరల్ మండల అభివృద్ధి పై చర్చకు రెడీ » బీజేపీ మండల నాయకులు

నిజామాబాద్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారిపై కాంగ్రెస్ నాయకులు అవాకులు, చెవాకులు మాట్లాడుతున్నారని, జాగ్రత్తగా మాట్లాడాలని రూరల్ మండల బీజేపీ నాయకులు మూల జగన్‌రెడ్డి, ఒంటెల శంకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రూరల్ మండలం గుండారం గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రూరల్ మండలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధమేనని, ఎమ్మెల్యే భూపతిరెడ్డి వచ్చినా తాము వివరిస్తామన్నారు. అభివృద్ధి అంటే కేవలం మొరం అమ్ముకోవడం కాదని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే అనుచరులు ఆయనకు చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే భూపతిరెడ్డి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ బియ్యం వంటి పలు పథకాల్లో కేంద్రం వాటా ఎంతో ప్రజలకు వివరిద్దామని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌పై అనవసర వాఖ్యలు చేయవద్దని సూచించారు. సమావేశంలో పద్మారెడ్డి, జగన్ రెడ్డి, శంకర్ రెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

పల్లెల్లో వేడెక్కుతున్న రాజకీయం

(5వ పేజీ తరువాయి)

బోనస్ ఇవ్వకపోవడం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తోంది. నిజామాబాద్ పార్లమెంట్‌తో పాటు ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్ శాసన సభ్యులు కలిగి గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు పొందిన బీజేపీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లోను సత్తాచాటేందుకు వ్యూహాలు రచిస్తోంది. కేంద్రం చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామాలకు కేంద్రం ద్వారా వచ్చే నిధులు తదితర అంశాలను ప్రజలకు వివరిస్తూ ఓటర్లను ప్రసన్నంచేసుకునే పనిలోబీజేపీ నేతలున్నారు.

బీఆర్ఎస్, బీజేపీలకు అస్త్రంగా బీసీ రిజర్వేషన్లు..

స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకుని గవర్నర్‌కు ఆర్డినెన్స్ పంపి ఆ తర్వాత అసెంబ్లీలో తీర్మానించినా.. గత సెప్టెంబరులో ఇచ్చిన స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే విధించడంతో తిరిగి ప్రభుత్వం పాత పద్ధతుల్లోనే రిజర్వేషన్‌లను ఖరారుచేస్తూ పంచాయతీ ఎన్నికలకు సిద్ధమైంది. గవర్నర్ ఆర్డినెన్స్‌ను ఆమోదించలేదని ఢిల్లీలో సైతం ధర్నా చేసిన అధికార కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు గ్రామాల్లో ఇచ్చిన బీసీ రిజర్వేషన్‌లు తలనొప్పిగా మారాయి. గతంలో కంటే ఒకటి రెండు శాతం బీసీల రిజర్వేషన్‌లు పెరిగిన ప్రభుత్వం ఇచ్చిన 42శాతం రిజర్వేషన్‌లు అమలు కాకపోవడంతో బీసీలంతా గుర్రుగా ఉన్నారు. ఇదే అంశాన్ని ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు పంచాయతీ ఎన్నికల్లో ప్రచార అస్త్రంగా వాడుకుంటున్నాయి. ఇప్పటికే ప్రభుత్వంపై నేరుగా విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీలు ఇదే అంశాన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి పంచాయతీ ఎన్నికల్లో లబ్ధిపొందే ప్రయత్నం చేస్తున్నాయి. పార్టీపరంగా 42శాతం రిజర్వేషన్‌లు అమలుచేస్తామని అధికార పార్టీ నేతలు చెబుతున్నా.. అది ఏ మేరకు అమలవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

సినిమా గైడ్

దేవి : రాజు వెడ్స్ రాంబాయి (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఆంధ్రకింగ్ తాలూకా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : దేదే ప్యార్‌దే-2 (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : సీసు రోడ్ ఆఫ్ రివేంజ్ (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 : ఆంధ్రకింగ్ తాలూకా (10.30, 1.30, 4.30, 7.35, 10.35)
స్క్రీన్-2 : రాజు వెడ్స్ రాంబాయి (11.00, 1.35, 7.30, 10.20)
: జూటోపియా-2 (ఇంగ్లీష్ 3డి) (4.30)
స్క్రీన్-3 : జూటోపియా-2 (ఇంగ్లీష్ 3డి) (11.00)
: రివాల్వర్ రీటా (1.30)
: తేరే ఇష్క్ మీన్ (హిందీ) (4.20, 7.20, 10.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1 : జూటోపియా-2 (తెలుగు 3డి) (11.00)
: జూటోపియా-2 (ఇంగ్లీష్ 3డి) (1.30)
: ఆంధ్రకింగ్ తాలూకా (4.00, 7.20, 10.40)
స్క్రీన్-2 : ఆంధ్ర కింగ్ తాలూకా (10.30, 1.50)
: రంగ్‌లీలా (హిందీ) (5.10)
: జూటోపియా-2 (ఇంగ్లీష్ 3డి) (8.10)
: రాజు వెడ్స్ రాంబాయి (10.40)
స్క్రీన్-3 : జనతాబార్ (10.30)
: తేరే ఇష్క్‌మిన్ (హిందీ) (1.10, 7.30, 11.00)
: బిజినెస్‌మెన్ (4.40)
స్క్రీన్-4 : తేరే ఇష్క్ మిన్ (హిందీ) (10.30)
: రాజు వెడ్స్ రాంబాయి (2.00, 4.50, 7.40)
: రివాల్వర్ రీటా (10.30)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,27,300	రూ.1,17,300	రూ.1640

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.270	రూ. 290

